## కాళోజీ హెల్త్ యూనివర్శిటీ మెడికల్ పిజి మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 4:** రాష్ట్రంలోని ప్రైవేట్ నాన్‌మైనారిటీ, మైనారిటీ వైద్య కళాశాలల్లో నీట్‌పిజి 2025 అర్హత కలిగిన అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ఫారాలను కాళోజీ హెల్త్ యూనివర్శిటీ ఆహ్వా నించింది. ఈ నెల 4వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి 11వ తేదీ సాయంత్రం ఆరుగంటల వరకు దరఖాస్తులకు స్వీకరిస్తారు. 2025 -26 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ నాన్‌మైనారిటీ, మైనారిటీ వైద్య కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కింద పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ డిగ్రీ/డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి కెఎన్ఆర్‌కు అనుబంధంగా ఉన్న మైనారిటీ వైద్య కళాశాలలు, తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ లోని హెల్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం, మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో ప్రవేశానికి రాష్ట్ర మెరిట్ స్థానాన్ని నిర్ణయించడానికి వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం నోటిఫికేషన్ జారీ చేయచేశారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సమయంలో అప్‌లోడ్ చేయబడిన అన్ని సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత తాత్కాలిక మెరిట్ జాబితా తెలి యజేయ బడుతుందని అధికారులు తెలిపారు. 2025 -26 విద్యాసంవత్సరానికి మేనేజ్‌మెంట్ కోటా కింద అందుబాటులో ఉన్న మొత్తం సీట్ల సంఖ్యను కౌన్సెలింగ్ కోసం వెబ్‌ఎంపికలను ఉపయోగించే ముందు వెబ్‌సైట్‌లో తెలియజేస్తారని వారు వివరించారు.

## అమెరికాలో పర్ఫ్యూమ్ కారణంగా భారతీయుడికి నెల రోజుల నరకం

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** అమెరికాలో పనిచేస్తూ అక్కడే స్థిరపడేందుకు యత్నిస్తున్న ఓ భారతీయుడు ఆ దేశ అధికారుల నిర్వాకం కారణంగా నెల రోజుల పాటు చేయని నేరానికి నిర్బంధంలో వుండాల్సి వచ్చింది. అమెరికాలోని ఆర్కా న్సాస్‌లో గల బెంటన్ నగరంలో నివసించే కపిల్ రఘు అనే వ్యక్తిని మే నెల 3న అక్కడి పోలీసులు సాధారణ ట్రాఫిక్ ఉల్లంఘన కేసు కింద ఆపారు. రఘు ప్రయా ణిస్తున్న కారును తనిఖీ చేయగా ఒపిఎం అని రాసివున్న చిన్నపాటి పర్ఫ్యూమ్ బాటి ల్ లభించింది. ఇది కేవలం పర్ఫ్యూమ్ అని ఇందులో ఎలాంటిది లేదని రఘు చెబు తున్నా పోలీసులు మాత్రం ఇందులో మాదకద్రవ్యాల తాలూకు ఏదో వుందని అనుమానించి అరెస్టు చేశారు. అనంతరం పర్ఫ్యూమ్ బాటిల్‌ను ప రీక్షల నిమిత్తం లాబ్‌కు పంపగా అందులో ఏమీలేదని తేలింది. అయినప్పటికీ రఘును పోలీసులు వదల కుండా వీసా గడువు ముగిసిందని పేర్కొంటూ లూసియా నాలోని ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ కేంద్రానికి తరలించారు. అనంతరం అక్కడ 30 రోజులపాటు నిర్బంధంలో వుంచారు. అయితే మే 20న రఘుపై ఆరోపణలను కోర్టు కొట్టివేసినా నిర్బంధం కారణంగా అతని వీసా రద్దయ్యింది. దీనికి సంబంధించిన న్యాయ పోరాటాన్ని రఘు చేబట్టాడు.

# ఆశ్వయుజ పౌర్ణమి 'హార్వెస్ట్‌మూన్'!

### బంగారు, నారింజ రంగులో రేపు వెలిగిపోనున్న చంద్రుడు

### మొదలైన శరదృతువు.. చలికాలం ప్రారంభం



పౌర్ణమి చంద్రుని రూపం ఇలా (ఫైల్)

**హైదరాబాద్, అక్టోబరు 4, ప్రభాతవార్త:** ఈ యేడాది వర్షకాలం ముగిసి చలికాలం ప్రారంభానికి అంకురార్పణ జరిగింది. వర్ష రుతువు ముగిసి శరద్ రుతువు మొదలవడంతో పగటి పూట సమయం తక్కువగా నమోదవడం మొదలయ్యింది. ఈ క్రమంలోనే సూర్యాస్తమయ వేళలు ఇక నుంచి నిత్యం కొన్ని నిమిషాల పాటు తగ్గిపోనుంది. ఇందులో భాగంగా ఈ నెల ఆరవ తేదీన ఆశ్వయుజ మాసం పౌర్ణమి రోజున చంద్రుడు బంగారు, నారింజ రంగులో కనువిందు చేయనున్నాడు. శరద్‌రుతువు ప్రారంభానికి సంకేతంగా ఆశ్వయుజ పౌర్ణమి రోజున నిండు పున్నమి వేళ ఇలాంటి దృశ్యాలు క నిపించడాన్ని హార్వెస్ట్ మూన్‌గా అంతరిక్ష శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ఏడాది చంద్రుడు నిండు పున్నమి వేళ ఇలా కనిపించడం ఇది రెండసారిగా శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఇంతకు ముందు చైత్ర మాసంలో ఈ ఏడాది ఒకసారి ఇలా కనువిందు చేసింది. కాగా ఈ పౌర్ణమి రోజున చంద్రుడు భూమి కక్షకు దగ్గరగా వస్తాడని అంతరిక్ష శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ క్రమంలో చంద్రుడు మామూలు కన్నా కొంత ఎక్కువ ప్రకాశవంతంగా కనిపించనున్నాడు. ఈ కారణంతోనే దీనిని హార్వెస్ట్ మూన్‌గా పిలుస్తారని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఉత్తర్ధాగోళంలో శరద్‌రుతువు ప్రారంభానికి సంకేత ంగా వచ్చే పౌర్ణమిని హార్వెస్ట్ మూన్‌గా కూడా పిలుస్తారు. ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్న దాని ప్రకారం ఈక్వినాక్స్ సమయంలో (శరద్‌రుతువు ఏర్ప డే సమయం) ఇలాంటి పౌర్ణమి ఏర్పడుతుంది. ఇదే సమయంలో దీనిని హంటర్ మూన్‌గా కూడా పిలుస్తారు. అక్టోబరు ఆరవ తేదీన రాత్రి 10.48 గంటలకు చంద్రుడి పౌర్ణమి దశ మొదలవుతుంది. వరి, మొక్కజొన్న, బీన్స్, గుమ్మడి కాయల వంటి పంటలు కోతలకు సిద్ధంగా వున్న సమయంలో ఈ పౌర్ణమి ఏర్పడనుండడంతో దీనిని హార్వెస్ట్ మూన్‌గా పిలుస్తారని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పంట పొలాలు ప్రకాశవంతంగా చేయడం వల్ల ఇ లా పిలుస్తారు.

పౌర్ణమి వేళ క్షితిజ సమాంతరంగా తక్కువగా వుండడం వల్ల సూర్యకాంతి చంద్రుడి ఉపరి తలంపై తక్కువగా పడడం వల్ల చంద్రు డు బంగారు. నారింజ రంగులో కనువిందు చేస్తాడు. ఆశ్వయుజ మాసం నుంచి రాబోయే నాలుగు నెలల పాటు ఆకాశం నిర్మలంగా వుండి చంద్రుడు స్పష్టంగా కనిపించే వీలుంది. ఈ సమయంలో మేఘాలు పెద్దగా ఉండకపోవడంతో చంద్రుడి వెన్నెల ఎక్కువగా కనిపించనుండడంతో జంతువులు రాత్రివేళలో ఆహార వేటను ఎక్కువగా కొనసాగిస్తాయి.

# 'స్థానిక' ఎన్నికల కోసం కాల్ సెంటర్ ఏర్పాటు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు 4:** రాష్ట్రంలో తొలి రెండు దశల్లో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. మొత్తం ఐదు దశల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి రెండు దశల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, మిగతా మూడు దశల్లో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించబడతాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎన్నికల సమాచారం, ఫిర్యాదులు, సంబంధిత అంశాలపై వివరాల కోసం 9240021456 నెంబర్‌కు ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలియజేసింది.

తెలంగాణ రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 565 జెడ్పీటీసీ స్థానాలకు, 5,749 ఎంపీటీసీ స్థానాలకు, 12,733 గ్రామ పంచాయతీలకు, 1,12,288 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అక్టోబర్ 23న తొలి విడత, అక్టోబర్ 27న రెండో విడత పోలింగ్ జరుగుతుంది.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు తొలి విడత అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో విడత నవంబర్ 8న పోలింగ్ ఉంటుంది. పోలింగ్ పూర్తయిన తర్వాత ఏ విడత ఫలితాలను అదే రోజు ప్రకటిస్తారు. నవంబర్ 11న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఎన్నికల సంఘం వెల్లడించింది.

## ప్రాణం తీసిన సెలవుల సరదా

### ఓ ఫామ్‌హౌస్‌లో ఆడిపాడిన 13 మంది విద్యార్థులు

### బావిలో పడి ఇద్దరు మునక

**నార్కెట్‌పల్లి ప్రభాతవార్త, అక్టోబరు 4:** స్నేహితులతో సరదాగా గడపాలనుకుని వెళ్లిన యువకులు తిరిగిరాని లోకాలకు వెళ్లి కన్న వాళ్లకు కన్నీటిని మిగిల్చారు. చిన్నప్పటి నుంచి ఒకే చోట ఆడుతూ, పాడుతూ, చదువుకుంటున్నారు. పదవ తరగతి పూర్తి చేసి రెండేళ్ల కావడంతో, ఒకసారి కలుసుకుని ఒక సమావేశాన్ని నిర్వహించాలని అనుకున్నారు. ఈ పార్టీకి దసరా పండుగ సెలవులను ఎంచుకున్నారు. ఇంకా చెప్పాలంటే, శనివారం ఉదయం, నకిరేకల్, నార్కట్ పల్లి, చౌటుప్పల్ ప్రాంతాలకు చెందిన 13 మంది విద్యార్థులు ఒకేచోట కలుసుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు వారు సంతోషంగా గడిపారు. ఈలోగా, ఒక విషాద సంఘటన జరిగింది. దీంతో ఆ ప్రాంత ˘మంతా దుఃఖంతో నిండిపోయింది. ఇప్పటివరకు ఆడుతూ, పాడుతూ ఉన్న తమ స్నేహితులు నీటిలో మునిగి చనిపోవడంతో తోటి విద్యార్థులు తమ బాధను వ్యక్తం చేయలేక షాక్ అయ్యారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే ఆ ప్రాంతానికి చేరుకుని విషయం తెలుసుకున్నారు.స్థానికులు, స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం... నార్కట్‌పల్లి శివార్లలోని శ్రీ విద్యాపీఠ్ పాఠ శాలలో 2022 -23లో 10వ తరగతి పూర్తి చేసిన 13 మంది విద్యార్థులు కలవాలనుకున్నారు. ఇందుకు నార్కట్‌పల్లి శివార్లలోని జువ్విగూడెం గ్రామంలోని ఫామ్‌హౌస్‌ను వేదికగా చేసుకున్నారు. సాయంత్రం వరకు వారు బాగా ఆడుతూ, పాటలు పాడుతూ గడిపారు. ఇంతలో, నార్కట్‌పల్లికి చెందిన వ్యాపారస్తులు నల్లగొండ నాగరాజు స్వాతి దంపతుల పెద్ద కుమారుడు నల్గొండ రిషిక్ (17) మరియు చౌటుప్పల్ ప్రాంతానికి చెందిన జిల్లా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు పోలోజు శ్రీనివాస చారి కుమారుడు పోలోజు హర్షవర్ధన్ (17)అక్కడున్న బావిలో నీటిలో మునిగిపోయారు. ఏమి చేయాలో తెలియక స్నేహితులు ఒక్కసారిగా అరవడం ప్రారంభించారు. గమనించిన స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని విషయం తెలుసుకున్నారు. నీటిలో మునిగిపోయిన ఇద్దరు విద్యార్థులను స్థానిక పోలీసులు బయటకు తీసి, పోస్టుమార్టం కోసం నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## 2023లో 10,580 మంది బలవన్మరణం

### 31.9 శాతం మరణాలకు కుటుంబసమస్యలే కారణం

# రాష్ట్రంలో పెరిగిన ఆత్మహత్యలు

**హైదరాబాద్, అక్టోబరు, 4, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా ఆత్మహత్యల ఘటనలు కలకలం రేపుతున్నాయి. కుటుంబ సమస్యలతోపాటు ఒంటరితనం, మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారడం వంటి అంశాలు ఆత్మహత్యల ఘటనలను పెంచుతున్నట్లు జాతీయ నేర రికార్డులు బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) 2023కి సంబంధించిన నివేదిక తేట తెల్లం చేసింది. ఆత్మహత్య కేసుల్లో మహారాష్ట్రలో 22,687, తమిళనాడులో 19,483, మధ్యప్రదేశ్‌లో 15, 662, కర్ణాటకలో 13,330, కేరళలో 10,972 ఘటనల తరువాత తెలంగాణలో 10,580 ఘటనలు జరిగాయి. అయితే జనాభా నిష్పత్తి ప్రకారం తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన ఉండడం గమనార్హం. ప్రతి లక్ష జనాభాకు 27.7గా ఉందని ఎన్‌సిఆర్‌బి పేర్కొంది. ఇది జాతీయ సగటు 12.3 కంటే అధికంగా వుందని ఆ నివేదిక వెల్లడించింది. ఆత్మహత్యలకు సంబంధించి కుటుంబ సమస్యలు అధికంగా వున్నాయని ఎన్‌సిఆర్‌బి తెలిపింది. ఇక ఆత్మహత్య చేసుకున్న వారిలో రోజువారి కూలీలతో పాటు స్వయం ఉపాధి పొందుతున్న వారు ఎక్కువగా వుండడం గమనార్హం. వీరితోపాటు మహిళలు, ఒంటరిగా వుండే వారు కూడా ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు ఎన్‌సిఆర్‌బి పరిశీలనలో తేలింది. దేశ వ్యాప్తంగా 2023లో లక్షా 71 వేల 418 మంది ఆత్మహత్యలకు పాల్పడినట్లు ఎన్‌సిఆర్‌బి నివే దిక తేటతెల్లం చేసింది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 0.3 శాతం పెరగడం గమనార్హం. జనాభా నిష్పత్తి ప్రకారం అండమాన్ నికోబార్‌లో 49.6, సిక్కింలో 40.2, కేరళలో 30.6, పాండిచ్చేరిలో 28.0, తెలంగాణ లో 27.7 శాతంగా వుంది. ఆత్మహత్యలు పెరిగిన రాష్ట్రాల వరకు వస్తే బీహార్‌లో 31.9 శాతం, హిమాచల్ ప్రదేశ్‌లో 27 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 12 శాతం వుండగా తగ్గిన రాష్ట్రాల జాబితా ఇలావుంది.

మిజోరంలో 35.9 శాతం, నాగా లాండ్‌లో 26.5 శాతం, అరుణాచల్ ప్రదేశ్‌లో 14.1 శాతంగా వుంది. దేశ రాజధాని ఢిల్లీలో 3131 ఆత్మ హత్య ఘటనలు వెలుగు చూశాయి. కాగా ఆత్మహత్యలకు కుటుంబ సమస్యలు 31.9 శాతం కారణం కాగా 19 శాతం అనారోగ్య సమస్యలుగా ఎన్‌సిఆర్‌బి నివేదిక చెబుతోంది. మాదకద్రవ్యాలకు బానిసలుగా మానిన వారు, ఒత్తిళ్ల కారణంగా తనువు చాలించాలనుకున్న వారు ఐదు శాతం మంది వున్నారు. కాగా రైతుల ఆత్మహత్యలు మహారాష్ట్ర, కర్నాటకలో ఎక్కువగా వున్నాయి. మొత్తం రైతుల ఆత్మహత్యల కేసుల్లో 60 శాతం ఈ రెండు రాష్ట్రాలలోనే వున్నాయి. ఇక విద్యార్థుల ఆత్మహత్యల వరకు వస్తే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడులలో ఎక్కువగా ఉన్నాయి.

**ఆహార కల్తీలోనూ రాష్ట్రానిది అగ్రస్థానం**

ఇదిలా ఉండగా ఆహార భద్రత విషయంలో తెలంగాణ పనితీరు మరింత దిగజా రిందని ఎన్‌సిఆర్‌బి నివేదిక తేటతెల్లం చేసింది. ఆహార కల్తీ కేసుల్లో దేశంలోనే తెలంగాణ అగ్రభాగానే నిలిచింది. తెలంగాణలో 2023లో 382 ఆహార, ఔషధ కల్తీ కేసులు నమోదు కాగా ఇందులో ఒక్క హైదరాబాద్‌లోనే 218 ఉండడం గమనార్హం. అయితే ఈ కేసుల్లో కల్తీ నిరోధక చట్టం కింద ఒక్క కేసు కూడా నమోదవలేదని ఎన్‌సి ఆర్‌బి పేర్కొంది. దీంతోపాటు ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించిన కేసుల విష యంలో తెలంగాణ ఐదో స్థానంలో ఉందని ఎన్‌సిఆర్‌బి పేర్కొంది.

## స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు 4:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వంగ గోపాల్ రెడ్డి అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ నెల 6న ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టనుంది. 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని, ఇది సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమంటూ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

మరోవైపు, బీసీ రిజర్వేషన్లకు సంబంధించి మాధవరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఈ నెల 8న తిరిగి విచారణ జరపనుంది. ఎన్నికల కోసం షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో రిజర్వేషన్ల అంశం హైకోర్టు, సుప్రీంకోర్టుకు చేరడం గమనార్హం.

# ట్రిపుల్‌ఆర్ భూనిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తాం


### రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



శనివారం భూనిర్వాసితులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**చిట్యాల రూరల్, అక్టోబరు 4, ప్రభాతవార్త :** ప్రాంతీయ వలయ రహదారి(ఆర్ఆర్ఆర్) దక్షి ణ భాగం ఎలైన్మెంట్ ఇంకా పూర్తి కాలేదని, కేంద్రానికి పంపింది ప్రస్తుతం డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) మాత్రమేనని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. ఎలైన్మెంట్ పూర్తి అయినట్లు, రైతుల భూములు కోల్పోతున్నట్లు వివిధ పత్రికల్లో, సోషల్ మీడియాలో వచ్చిన కథనాలను, అపోహలను నమ్మి రైతులు ఆందోళన చెందవద్దని, ధర్నాలు, దీక్షలు అవసరం లేదని తనను కలిస్తే సమస్యలు పరిష్కారం చేస్తానని తెలిపారు. తుంగతుర్తిలో శనివారం నిర్వహించిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న ఆయన తిరిగి హైదరాబాద్ వెళుతూ మార్గమధ్యంలో నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో ట్రిపుల్‌ఆర్ విస్తరణలో భూములు కోల్పోతున్న చౌటుప్పల్, సంస్థ నారాయణపురం మండలాలకు చెందిన భూనిర్వాసితులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ట్రిపుల్‌ఆర్ ను కెసిఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని తాను మంత్రి అయిన తర్వాత 90శాతంకు పైగా భూమి సేకరణ చేసి రైతులను ఒప్పించినట్లు ఆయన తెలిపారు. డిసెంబర్ నెలలో ట్రిపుల్‌ఆర్ ఎలైన్మెంట్ జరగటంతో పాటు టెండర్ల ప్రక్రియ, వచ్చే ఏడాది జూన్ నెలలో పనులు ప్రారంభమవుతాయని, ఇందుకుగాను సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకొని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయం మేరకు ట్రిపుల్ ఆర్ ఎలైన్మెంట్ జరుగుతుందన్నారు. ఎలైన్మెంట్ పూర్తయిన తర్వాత మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రితో చర్చించి రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు. భూములు కోల్పోతున్న ఆయా గ్రామాల్లోని రైతులతో అధికారులు గ్రామసభలు ఏర్పాటు చేసి రైతులు నిర్ణయాలతో, నాణ్యమైన పరిహారం చెల్లించి భూసేకరణ చేసేందుకు గానూ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకుగాను భూసేకరణకు రూ. 15 వేల కోట్లను, నిర్మాణానికి రూ. 30 వేల కోట్ల నిధులతో పనులు జరుపనున్నట్లు ఆయన వివరించారు. రైతులను ఒప్పించిన తర్వాత మాత్రమే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఎలైన్మెంట్ ప్రకారం రోడ్డు పనులలో పెద్ద పరిశ్రమలు వచ్చిన, రాజకీయ నాయకుల భూములు వచ్చిన ఎలాంటి మార్పు ఉండదన్నారు. చౌటుప్పల్ లోని దివీస్ ఫార్మా పరిశ్రమ కోసం ఎలైన్మెంట్ మారుస్తున్నట్లు పత్రికల్లో, సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను నమ్మి రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. తాను ఎప్పుడూ రైతుల పక్షాల ఉంటానని, ట్రిపుల్‌ఆర్ విషయంలో రైతులతో, రాజకీయ నాయకులతో మాట్లాడడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. హైదరాబాద్ విజయవాడ 65వ నెంబర్ జాతీయ రహదారిని 2022లోనే ఆరు వరుసలుగా చేయాలని ప్రతిపాదనలు ఉన్నా ఇప్పటి వరకు జీఎంఆర్ గుత్తేదారు సంస్థ చేయకపోవడంతో వారి అగ్రిమెంట్ రద్దయిందని పేర్కొన్నారు.

ప్రస్తుతం రహదారిపై పలుచోట్ల ధ్వంసమైన చోట మరమ్మత్తులు చేపట్టేందుకు అధికారులను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి అరువరుసలతో పాటు సర్వీస్ రోడ్లను విస్తరించేందుకు డిసెంబర్ లో టెండర్లు పూర్తి చేసి జనవరిలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఇందుకుగాను మరో 250 ఎకరాల భూసేకరణ చేయనున్నట్లు ఆయన వివరించారు. అనంతరం ట్రిపుల్‌ఆర్ రైతులు పల్లెల పుష్పారెడ్డి, కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, పగిళ్ల మోహన్ రెడ్డితో పాటు పలువురు రాష్ట్ర మంత్రికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ విలేకరుల సమావేశంలో చిట్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు కందిమల్ల శిశుపాల్ రెడ్డి, చౌటుప్పల్ మాజీ జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి, ఆవుల యాదయ్య, దోర్నాల రామచంద్రం, నీలకంఠ లింగస్వామి, ఇబ్రహీం, ఎడ్ల మహాలింగం తదితరులు పాల్గొన్నారు.



### సాలీనా రూ.2 కోట్ల ఆదాయం ఉన్నా

## నేటికీ ఫ్లోర్‌క్లీనర్ పనే

### టోక్యోలో కోయిచిముత్సుబారా అందరికీ ఆదర్శం

**టోక్యో,అక్టోబరు 4:** చేతికి అందినంతా, తినడానికి సరిపడే ఆదాయం వస్తే చాలు మనోళ్లు చేసే హడావిడి అంతా ఇంతాకాదు. కానీ జపాన్‌లో ఒక వ్యక్తి మాత్రం తన సంపాదనను పరిగణనలోనికి తీసుకోకుండా ఇప్పటికీ అత్యంత చులకనగా చూస్తే పారిశుధ్యపనులు చేస్తున్నాడు. నిజానికి అతడికి యేడాదికి రూ.2 కోట్ల ఆదాయం వస్తుంది. అవసరమైతే కోట్ల పెట్టుబడితో వ్యాపారం చేయవచ్చు. అది వద్దనుకుంటే ఇంట్లో కూర్చుని తినొచ్చు. కానీ అతడు మాత్రం అలా చేయడం లేదు. మొదటి నుంచి అలవాటైన బిల్డింగులలో ఫ్లోర్ క్లీనర్ పని చేస్తున్నాడు. కోట్ల ఆదాయం ఉన్నా నెలకు వేలల్లో వచ్చే జీతం కోసం ఫ్లోర్ క్లీనర్‌గా పనిచేస్తున్న ఆ కోటీశ్వరుడు కోయిచి మత్సుబారా. జపాన్ రాజధాని టోక్యోకు చెందిన మత్సుబారా చాలా తక్కువ వేతనానికి హౌస్ కీపింగ్ పనులు చేస్తున్నాడు. మత్సుబారా వయస్సు ప్రస్తుతం 56 యేళ్లు. అయినా అతను స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే వారంలో మూడు రోజులు, రోజుకు నాలుగు గంటల చొప్పున అతను పని చేస్తున్నారు. ఇందుకుగానూ ఆయనకు నెలకు సుమారుగా ఒక లక్ష యెన్‌ల జీతం వస్తున్నది. మన రూపాయల్లో అయితే అది దాదాపు రూ.60 వేలకు సమానం. టోక్యోలో సగటు నెల జీతం 3 లక్షల యెన్లతో పోల్చుకుంటే మత్సుబారా అందుకుంటున్నది చాలా తక్కువ అని చెప్పొచ్చు.

# ఒఆర్ఆర్‌పై పదేళ్లలో 10,666 ప్రమాదాలు

### గరిష్ట వేగం పెరిగాక దుర్ఘటనల వృద్ధి

### స్పీడ్ గన్‌ల ద్వారా జరిమానాలు విధిస్తున్నా ప్రయోజనం శూన్యం

**ఒఆర్ఆర్‌పై 2016 నుంచి 2015 జూలై వరకు జరిగిన ప్రమాదాల వివరాలు**

| యేడాది | మొత్తం ప్రమాదాలు | పగలు | రాత్రి |
|---|---|---|---|
| 2016 | 1545 | 839 | 706 |
| 2017 | 1562 | 869 | 693 |
| 2018 | 618 | 380 | 238 |
| 2019 | 782 | 506 | 276 |
| 2020 | 641 | 387 | 254 |
| 2021 | 840 | 494 | 346 |
| 2022 | 1029 | 587 | 442 |
| 2023 | 1402 | 795 | 607 |
| 2024 | 1592 | 859 | 733 |
| 2025 జూలై వరకు | 655 | 370 | 285 |

**హైదరాబాద్, అక్టోబరు, 4, ప్రభాత వార్త:** రాష్ట్రానికి మకుటాయ మానం గా వున్న అవుటర్ రింగ్ రోడ్ (ఓఆర్ ఆర్)పై గడచిన పదేళ్ల కాలంలో 10,666 రోడ్డు ప్రమాదాలు జరిగి నట్లు రహదారి భద్రతా విభాగం తేల్చింది. ఓఆర్ఆర్‌పై గరిష్ట వేగం పెరిగిన తరువాతే ప్రమాదాల సంఖ్య పెరిగినట్లు ఇందులో తేలింది. గతంలో ఓఆర్ఆర్‌పై గరిష్ట వేగం గంటకు 120 కిలోమీటర్లుగా వుం డేది. అప్పట్లో ప్రమాదాలు ఎక్కువగా జరగడంతో దీనిని వంద కిలో మీటర్లకు తగ్గించారు. దీంతో ప్రమాదాలు కొంతమేర తగ్గాయి. అయితే రెండేళ్ల క్రితం మళ్లీ దీనిని 120 కిలోమీటర్లకు పెంచడంతో ప్రమా దాలు మరింత పెరిగాయని రహదారి భద్రతా విభాగం అధ్యయనంలో తేలింది. ఓఆర్ఆర్ 158 కిలోమీటర్ల పొడవు వుండగా సగటున రోజుకు 2.46 లక్షల వాహనాలు తిరుగుతున్నాయి.

పదేళ్లలో పగటిపూట 6086 ప్రమాదాఆలు, రాత్రి వేళ 4580 ప్రమాదాలు జరిగాయని రహదారి భ ద్రతా విభాగం పరిశీల నలో తేలింది. ఓఆర్ఆర్ అంతర్జాతీయ ప్రమాణా లతో రూపొం దిన రహదారిగా వున్నా ప్రమా దాల సంఖ్య ఎక్కువగానే వుండ డం పల్ల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే వాహనాలు అత్యవసర పరిస్థితుల్లో అదుపు చేయాల్సి వస్తే చేయలేక పోవడంతో ప్రమాదాలు ఎక్కువ య్యేందుకు కారణమని నిపుణులు చెబుతున్నారు. కాగా ఓఆర్ఆర్‌పై 2016 నుంచి 2017 మధ్య అధికం గా ప్రమాదాలు జరగగా 2017... 2023 మధ్య గరిష్ట వేగం తగ్గిన తరువాత తగ్గాయి. 2023 నుంచి గరిష్ట వేగం పెరిగాక ప్రమా దాలు మరింత పెరిగాయి. మరోవైపు ఓఆర్ఆర్‌పై అధిక వేగంతో వెళ్లే వాహనాలకు జరి మానాలు విధించే దుకు ఆయా ప్రాంతాల పోలీ సులు స్పీడ్ గన్ల సహకారం తీసుకుం టున్నా దీనివల్ల పూర్తిగా ప్రయోజనం కానరావడం లేదు. ప్రతీనెల వేలాది వాహనాలకు పోలీసులు లక్షలాది రూపాయలు జరిమానా విధి స్తున్నా ఇవేవి ప్రమాదాలను నివారించలేక పోతున్నాయి.

## అర్ధనగ్నంగా మందుకొడుతూ వర్చువల్ విచారణలో ఆగంతకుడు

### విస్తుపోయిన ఢిల్లీ కోర్టు న్యాయాధికారులు

**న్యూఢిల్లీ, అక్టోబరు 4:** దేశ రాజధాని దిల్లీలో జరిగిన ఓ వింత ఘటన న్యాయవ్యవస్థలో కలకలం రేపింది. ఆన్‌లైన్‌లో జరుగుతున్న కోర్టు విచారణకు ఓ వ్యక్తి అర్ధనగ్నంగా, సిగరెట్ తాగుతూ, మద్యం సేవిస్తూ ప్రత్యక్షమయ్యాడు. ఈ అనూహ్య సంఘటనపై తీవ్రంగా స్పందించిన న్యాయస్థానం, అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. వివరాల్లోకి వెళితే, గత నెల సెప్టెంబర్ 16, 17 తేదీల్లో దిల్లీ కోర్టుకు సంబంధించిన విచారణలు వెబ్‌ఎక్స్ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా జరుగుతున్నాయి. ఈ సమయంలో 'అకిబ్ అఖ్లక్' అనే యూజర్ ఐడీతో ఓ వ్యక్తి లాగిన్ అయ్యాడు. అతడు కేవలం లోదుస్తులు ధరించి, అర్ధనగ్నంగా కనిపించడమే కాకుండా, సిగరెట్ తాగుతూ, మద్యం సేవిస్తూ కనిపించడంతో కోర్టు అధికారులు నివ్వెరపోయారు. కోర్టు కార్యకలాపాలను అపహాస్యం చేసేలా ప్రవర్తించిన అతడిపై చర్యలకు ఉపక్రమించారు. కోర్టు ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు. ఆ యూజర్‌ను న్యూదిల్లీలోని గోకుల్‌పురి ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఇమ్రాన్‌గా గుర్తించారు. అతడు తరచూ తన నివాసాన్ని మారుస్తుండటంతో పట్టుకోవడానికి కొంత సమయం పట్టింది.

చివరకు అతడిని అరెస్ట్ చేసి, నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్, సిమ్ కార్డు, రౌటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో ఇమ్రాన్ గురించి మరిన్ని సంచలన విషయాలు బయటపడ్డాయి. అతడో పాత నేరస్థుడని, దిల్లీ వ్యాప్తంగా అతడిపై 50కి పైగా దోపిడీలు, ఇతర నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. కోర్టు విచారణకు సంబంధించిన లింక్ అతడికి ఎలా లభించిందనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటన ఆన్‌లైన్ విచారణల భద్రతపై కొత్త సందేహాలను లేవనెత్తింది.

